తెలుగు సారస్వత సాంస్కృతిక సంఘము
Telugu Literary And Cultural Association

# అనగనగా

## జ్ఞాన బోధ

*పల్లవిశ్రీరాం*

రామాపురం అనే గ్రామానికి ఎక్కడి నుంచో ఒక వేదాంతి వచ్చి, సత్రం అరుగు మీద కూర్చుని ధర్మం , న్యాయం , సత్ప్రవర్తనల గురించి బోధలు చేయసాగాడు. గ్రామస్లో చాలా మంది ఆయన బోధలు వినడానికి వెళ్లసాగారు. వేదాంతి వాళ్లతో రోజూ ఒక గుప్పెడు బియ్యం , 50 పైసలు తెస్తూండమని చెప్పేవాడు. జనం అలాగే చేసేవారు. ఒక రోజు, ఆ గ్రామంలో బాగా చదువుకున్నవాడని పేరు ఉన్న గోపి అనే ఆసామీ వేదాంతికి భక్తిగా నమస్కరించి, "స్వామి, మీ బోధలు విన్న తర్వాత, అప్పటివరకు అపమార్గాన నడిచే చాలామంది సన్మార్గాననికి మారారు. గ్రామంలో తంపులూ, జగడాలు కుడా తగ్గిపోయాయి. కానీ, తమను గురించి నన్నొక అనుమానం వేధిస్తున్నది. అనుమతిస్తే అడుగుతాను" అన్నాడు. "నిర్భయంగా అడుగు నాయనా !" అన్నాడు వేదాంతి. "తమరు చేసే బోధల్లో తరచూ ఆశ పనికి రాదనీ, ధనాపేక్ష కూడదనీ చెబుతూంటారు. అలాంటి మీరు, గ్రామస్థులను బియ్యం , పైసలు తెమ్మనటం ఏమి బాగుంది?" అన్నాడు గోపి. ఆ మాటలకు వేదాంతి నవ్వి, " నాయనా, నీ మాటల ద్వారా తెలుస్తున్నదేమంటే నా బోధలు గ్రామస్థులకు మేలు చేస్తున్నవని. కొద్ది రోజుల తర్వాత ఇదే మేలు పొరుగు గ్రామస్థులకు కూడా చేయదలిచాను. అందుకు నేను బతికి ఉండాలి కదా !" అన్నాడు. ఆ మర్నాటి నుంచీ గ్రామస్థులు వేదాంతికి బియ్యంతో పాటు పప్పూ,ఉప్పూ,కూరగాయలు కుడా ఇవ్వసాగారు.